## ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

**ఆసిఫాబాద్ జిల్లా జడ్జి ఎం.వీ రమేశ్**


ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి ఎం. వీ రమేశ్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 27: ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని జిల్లా జడ్జి ఎం. వీ రమేశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల సబ్ జైలును ఆయన సందర్శించి, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన ఖైదీలతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అండర్ ట్రయల్ ఉన్న ఖైదీలు, న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేని వారు ప్రభుత్వ న్యాయవాది సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం జైలు పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్ ఉన్నారు.


పీహెచ్‌సీలో వైద్యసేవలపై బాలింతను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

## మెరుగైన వైద్యసేవలు అందించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- కెరమెరి పీహెచ్‌సీ, ధనోర ఉర్దూ మీడియం పాఠశాల సందర్శన

కెరమెరి, జూలై 27 : ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. శనివారం కెరమెరిలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. దవాఖానలో అందుతున్న వైద్య సేవల గురించి బాలింతలను అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా, డెంగ్యూవంటి జ్వరాలు ప్రబలే అవకాశాలున్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతిరోజూ హాస్పిటల్ గదులు, ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అంతకుముందు ధనోర ఉర్దూ మీడియం పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేసి పాఠశాల కమిటీని అభినందించారు. ప్రభుత్వ బడుల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి గుణాత్మకమైన విద్య అందించడం జరుగుతోందని, విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో తుకారాం భట్, డీపీవో భిక్షపతి గౌడ్, తహసీల్దార్ దత్తు ప్రసాదరావు, ఎంపీడీవో మహ్మద్ అమ్జద్‌పాషా, మండల నోడల్ అధికారి ప్రకాశ్, వైద్యాధికారి క్రాంతికిరణ్, టీడబ్ల్యూ ఏఈ నజీమొద్దీన్, ఏపీఎం జగదీశ్వర్, ధనోర మాజీ ఉప సర్పంచ్ సయ్యద్ రిజ్వాన్ పాల్గొన్నారు.


జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న సీపీ, పోలీసు అధికారులు

## డయల్ 100, 112 కాల్స్‌పై తక్షణమే స్పందించాలి

**రామగుండం సీపీ శ్రీనివాస్**

మంచిర్యాల అర్బన్, జూలై 27 : డయల్ 100,112 కాల్స్‌పై తక్షణమే స్పందించాలని రామంగుండం కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో మంచిర్యాల పరిధిలోని డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్‌తో డయల్ 100,112 కాల్స్‌పై జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. స్కూల్స్, కాలేజీలు, బస్టాండ్‌వంటి రద్దీ ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ప్రజలకు రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## నేరాల నియంత్రణలో సిబ్బంది పాత్ర కీలకం

- ఆసిఫాబాద్ అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు
- జిల్లా పోలీసు అధికారులతో సమావేశం


మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 27 : నేరాల నియంత్రణలో డయల్ 100, 112 సిబ్బంది పాత్ర కీలకమని అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అధికారులతో అదనపు ఎస్పీ డయల్ 100పై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డయల్ 100, 112కి వచ్చిన ఫోన్లకు తక్షణమే స్పందించి ఘటనా స్థలానికి చేరుకోవాలని, పెట్రోకార్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలని సూచించారు. ఫోన్ పోగొట్టుకున్న వారికి సీఈఐఆర్ పోర్టల్‌లో ఫోన్ బ్లాక్ చేసి బాధితులకు సత్వర న్యాయం చేయాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు, యాప్‌లపై నిరంతరం అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సైబర్ నేరాలకు గురైనట్లైతే 1930కు తక్షణమే సమాచారం అందించాలని తెలిపారు.

## నేడే గాంధారి మైసమ్మ జాతర

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పరిశీలించిన డీసీపీ, ఏసీపీ

రామకృష్ణాపూర్, జూలై 27 : మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామ పంచాయతీ, క్యాతనపల్లి మున్సిపాలిటీ 9వ వార్డు శివారులో కొలువైన గాంధారి మైసమ్మ బోనాల జాతరను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ మండపంలో గ్రానైట్ వేయించారు. చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. టెంట్లు వేసి.. బారికేడ్లు నిర్మించారు. బొక్కలగుట్ట బస్‌స్టేజీ వద్ద హైదరాబాద్‌- నాగ్‌పూర్ ప్రధాన రహదారి పక్కన కొలువు దీరిన మైసమ్మ జాతరకు ఆసిఫాబాద్ జిల్లాతో పాటు మంచిర్యాల జిల్లాలోని కోల్‌బెల్ట్ ప్రాంతమైన శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, గోలేటి, తాండూర్ గనుల ప్రాంతాల నుంచి కార్మిక కుటుంబాలు వేలాదిగా తరలిరానున్నాయి. మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఆలయ కమిటీ సభ్యులు శనివారం సాయంత్రం ఏర్పాట్లు పరిశీలించారు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్, కమిటీ సభ్యులు ఉన్నారు.


గాంధారి మైసమ్మ బోనాల జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్


భీమారం : మద్దికల్‌లో కూలిన చింతం బానక్క ఇల్లు


భీమారం : కొత్తపల్లిలో కూలిన రోశయ్య ఇంటి గోడ

మంచిర్యాలటౌన్ : రంగంపేట కాజ్‌వే పై నుంచి ప్రవహిస్తున్న రాళ్లవాగు


# వాన.. వరద..

## మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఎడతెరిపిలేని వాన

- జలమయమైన కాలనీలు
- నదులు, ప్రాజెక్టుల్లోకి భారీగా వరద
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- నీట మునిగిన పంటలు
- కూలిన ఇండ్లు


జైపూర్ : టేకుమట్ల లో లెవల్ వంతెనపై ప్రవహిస్తున్న వరద

నమస్తే నెట్‌వర్క్, జూలై 27 : మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా ముసురు పడుతుండగా, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నదులు, ప్రాజెక్టులకు వరద పోటెత్తుతుండగా, వాగులు.. వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకొని, ఆయా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మంచిర్యాల పట్టణంలోని సీతారామకాలనీ, బృందావన్ కాలనీ, సాయికుంట, హమాలీవాడ, తిలక్‌నగర్, శ్రీశ్రీనగర్, గర్మిళ్ల, పాతమంచిర్యాల, పద్మశాలీ కాలనీ, రంగంపేట, వికాస్‌నగర్, జన్మభూమినగర్, గౌతమీనగర్ ప్రాంతాల్లో రోడ్లపైకి వరద వచ్చిచేరగా, ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. మంచిర్యాల వద్ద రాళ్లవాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నది. మంచిర్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డు, అమరవీరుల స్తూపం నుంచి రంగంపేట వైపుకు రాళ్లవాగుపై నిర్మించిన కాజ్‌వే పై నుంచి వరద ప్రవహిస్తుండగా, రాకపోకలు నిలిచిపోయాయి. చెన్నూర్ పట్టణంలోని రహదారులు చిత్తడిగా మారాయి. శిథిలావస్థకు చేరిన ఇళ్లను మున్సిపాలిటీ కమిషనర్ గంగాధర్ పరిశీలించారు. చెన్నూర్ మండలంలోని కత్తరశాల వాగులో జోరుగా ప్రవహిస్తుండగా, సంకారం, బుద్ధారం, కన్నెపల్లి గ్రామాల్లోని రహదారుల మధ్య ఉన్న కల్వర్టులు పొంగిపొర్లుతున్నాయి. అక్కెపల్లి సమీపంలో ఉన్న కాజ్‌వే పైకి వరద వచ్చి అక్కెపల్లి, శివలింగాపూర్ గ్రామాలకు నాలుగు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. చెన్నూర్ పట్టణంలోని ఆస్నాద్ రోడ్‌లో మినీ ట్యాంక్ బండ వద్ద రెండు గొర్రెలు ఇనుప కంచెకు తగలగా, విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాయి. జైపూర్ మండలంలోని మిట్టపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. టేకుమట్ల లో లెవల్ వంతెనపై నుంచి వరద పారుతుండగా, శెట్‌పల్లి, కుందారం, శివ్వారం గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అక్కడ జైపూర్ పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. కాసిపేట మండలం దేవాపూర్ సల్పాలవాగు ప్రవాహం ఆకట్టుకుంటున్నది. చుట్టూ ఎత్తైన గుట్టలు, దట్టమైన అటవీ ప్రాంతం మధ్య గలగల పారుతూ కనువిందు చేస్తున్నది. కోటపల్లి మండలం నక్కలపల్లి లోతొర్రె, రాజారం గ్రామానికి వెళ్లే దారిలోని వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. ప్రాణహిత ఉప్పొంగి ప్రవహిస్తుండగా, నది తీరం వెంట ఉన్న పంట పొలాలు నీట మునిగిపోయాయి. లింగన్నపేట గ్రామానికి చెందిన తాడూరి శేఖర్‌కు చెందిన ఇల్లు కూలిపోయింది. భీమారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ జలమయం కావడంతో, స్థానికులు బానోత్ విద్యాసాగర్, దస్రు, శ్యాం, సాయి, శంకర్, రాజు, దేవేందర్ మోకాళ్ల లోతు నీటిలో నిరసన తెలిపారు. తమ కాలనీ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన దుర్గం రోశయ్య, మద్దికల్ గ్రామానికి చెందిన చింతం బానక్కకు చెందిన ఇండ్ల గోడలు కూలిపోయాయి. బెల్లంపల్లి పట్టణంలో జూనియర్ సివిల్ కోర్టు ముందున్న పాత మున్సిపల్ కార్యాలయ భవనం శనివారం కూలిపోయింది. మున్సిపల్ అధికారులు సత్వరమే స్పందించి కూలిపోయిన గోడలను తొలగించాలని, మున్సిపల్ వాహనాలు, పరికరాలను ఇతర చోటికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు. హాజీపూర్ మండలం గుడిపేట శివారులో గోదావరి నదిపై నిర్మించి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతున్నది. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టు క్రస్ట్ లెవల్ 148 మీటర్లకుగాను, 147.00కి చేరింది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, 17.3069 టీఎంసీలకు చేరుకున్నది. 21586 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, హైదరాబాద్ తాగునీటికి 331 క్యూసెక్కులు, నంది పంపు హౌస్ నుంచి 12,300 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.


హాజీపూర్ : నిండుకుండలా ఎల్లంపల్లి ప్రాజెక్టు

### ఆసిఫాబాద్ జిల్లాలో..

దహెగాం మండలం కోత్మీర్ పంచాయతీ పరిధిలోని జెండాగూడకు వెళ్లే దారిలో గల రోరుమల్లి వాగులోకి వరద చేరడంతో పెండ్లి బృందం దాటేందుకు ఇబ్బందులు పడింది. మండల కేంద్రం నుంచి లగ్గాం వైపు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారగా, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పెంచికల్‌పేట్ మండలం ఉచ్చమల్లి వాగు, బొక్కివాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా, పరివాహక ప్రాంతాల పంటలు నీట మునిగాయి.


మంచిర్యాలటౌన్ : సీతారామ కాలనీలో నిలిచిన వర్షపు నీరు


కోటపల్లి : జనగామ గ్రామ సమీపంలో నీట మునిగిన పత్తి పంట


దహెగాం : ప్రమాదకర స్థితిలో రోరుమల్లి వాగుదాటుతున్న పెండ్లి బృందం


కోటపల్లి : నక్కలపల్లి కి గ్రామానికి వెళ్లేదారిలో ఉప్పొంగి ప్రవహిస్తున్న లోతొర్రె

## సీపీఆర్‌పై అవగాహన అవసరం

నస్పూర్, జూలై 27 : ఆకస్మిక మరణాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగా ప్రపంచ సీపీఆర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పునర్జన్మ కార్యక్రమంలో భాగంగా శనివారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియాప్రతినిధులకు సీపీఆర్‌పై అవగాహన నిర్వహించారు. డీఎంహెచ్‌వో అనితతో కలిసి సీపీఆర్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్‌నాయక్, ప్రోగ్రాం అధికారి కృపామయి, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, సీడీపీవోలు, సూపర్ వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

### పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా స్త్రీ, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, బాలల సంరక్షణ అధికారి ఆనంద్‌తో కలిసి సీడీపీవోలు, సూపర్ వైజర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. సఖీ కేంద్రం పోస్టర్లను విడుదల చేశారు.

### సర్కారు బడుల్లో గుణాత్మక విద్య

సర్కారు బడుల్లో సకల సౌకర్యాలతో కూడిన గుణాత్మక విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ మేరకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపడుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో డీఈవో యాదయ్యతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం పురోగతిపై సమీక్షించారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679